# రాడికల్స్‌ కుదిర్చిన ఒప్పందం: పెరిగిన కూలీ రేట్లు

21-4-92

గజ్వేల్, ఏప్రిల్ 20 (న్యూస్‌టుడే): తాపీ మేస్త్రీలు, కూలీలకు కంట్రాక్టర్లు ఇచ్చే కూలీరేట్ల పెంపుదల విషయమై గత నాలుగు రోజులుగా ఇరువర్గాల మధ్య రాడికల్స్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఫలించాయి. కొత్తగా కుదిరిన ఒప్పందం మేరకు చాలా కాలంగా తాపీ మేస్త్రీలుగా కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్నవారికి ప్రస్తుతం ఇచ్చే 30 రూపాయల కూలీ మరో అయిదు రూపాయలకు పెంచారు. జూనియర్ మేస్త్రీలకు ప్రస్తుతం 25 రూపాయలు కూలీ వుండగా, దాన్ని 30 రూపాయలకు పెంచారు. ఆడ కూలీలకు ఇస్తున్న 10 రూపాయలను పెంచి 12 రూపాయలు, మగవారి కూలీని 13 నుంచి 15 రూపాయలకు పెంచేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించారు. చాలాఏళ్ళుగా పనిచేస్తున్న మేస్త్రీలతోపాటు, సంవత్సరంపాటు ఒకే కాంట్రాక్టరు వద్ద పనిచేసిన మేస్త్రీలందరికీ ఏడాదికి ఒక జతబట్టలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు ఒప్పుకున్నారు. వెయ్యిరూపాయలు బోనస్ ఇవ్వాలన్న డిమాండ్ మాత్రం తాత్కాలికంగా వాయిదావేసినట్లు తెలిసింది. మేస్త్రీల అవసరాలను బట్టి అయిదువేల వరకు అడ్వాన్సు ఇవ్వాలని మేస్త్రీలు చేస్తున్న డిమాండ్ విషయమై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు.